క్లుప్తంగా

ఖాళీ బిందెలతో నిరసన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

కల్హేర్(నారాయణఖేడ్): తాగునీటి సరఫరా లేకపోవడంతో మహిళలు ఖాళీ బిందెలతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. కల్హేర్ మండల కేంద్రంలోని కుర్మగల్లి, మీసాలగల్లి, తదితర వాడల్లో నీటి సరఫరా జరుగడంలేదని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు, పంచాయతీ కార్యదర్శి స్పందించడంలేదని మండిపడ్డారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని బైఠాయించారు. నీటి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి కృష్ణాచారి హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.

మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచండి

నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపాలిటీ కార్మికులకు వేతనాలు పెంచాలని ఏఐటీయూసీ జిల్లా నాయకులు ఆనంద్, చిరంజీవి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘం కార్యాలయంలో శుక్రవారం డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అమలు కావడం లేదన్నారు. కనీస వేతనంగా రూ.26 వేలు చెల్లిస్తూ ఉద్యోగాలను క్రమబద్ధీకరించి ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయాలు కల్పించాలన్నారు. కాస్మొటిక్ సామగ్రిని ప్రతినెలా ఇవ్వాలన్నారు. సంఘ డివిజన్ నాయకులు అశోక్, ప్రేమ్ కుమార్, సంజీవ్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

జహీరాబాద్: పట్టణంలోని వికాస తరంగిణి ఆధ్వర్యంలో 65వ జాతీయ రహదారి పక్కన ఉన్న ఎస్‌బీఐ బ్యాంకు వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వికాస తరంగిణి గౌరవ అధ్యక్షుడు విఠల్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రత మూలంగా ఇబ్బంది పడుతున్న పాదచారుల గొంతును తడిపేందుకు గాను త్రిదండి చిన్న జీయర్‌స్వామి మంగళ శాసనములతో చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు ఉమామహేశ్వరరావు, పి.వెంకట్‌రెడ్డి, శ్రీవాణి, బెజుగం సంధ్య, మంజులత, డాక్టర్ శేషు, హేమశ్రీ, విశాలాక్షి, పి.గోపాల్, దత్తారెడ్డి, బ్యాంకు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటుహక్కు వినియోగించుకోవాలి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): పార్లమెంట్ ఎన్నికల్లో ఓటుహక్కు ఉన్న ప్రతిఒక్కరూ తమ ఓటుహక్కు వినియోగించుకోవాలని పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పోట్రు రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో ఓటర్లను, ఉద్యోగులను కోరారు. పార్లమెంట్ ఎన్నికల విధులకు హాజరయ్యే ప్రభుత్వ ఉద్యోగులందరూ ఎన్నికల సంఘం కల్పించిన అవకాశం మేరకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యంను ఈ నెల 4 నుంచి 8 వరకు ఆయా నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటుహక్కు వినియోగించుకోవాలని అభ్యర్థించారు. ఈ సెంటర్లు ఆదివారం కూడా పనిచేస్తాయని తెలిపారు.

కరపత్రం విడుదల

జహీరాబాద్ టౌన్: ఈ నెల 25 నుంచి రెండు రోజుల పాటు కొనసాగే సీఐటీయూ జిల్లా కమిటీ సమావేశాల కరపత్రాన్ని శుక్రవారం నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి మహిపాల్ మాట్లాడుతూ సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్(సీఐటీయూ) జిల్లా కమిటీ సమావేశాలను ఈ నెల 25, 26 తేదీల్లో జహీరాబాద్ పట్టణంలో నిర్వహిస్తున్నామన్నారు. సమావేశాలకు రాష్ట్ర, జిల్లా కమిటీ నాయకులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో వివిధ పరిశ్రమల నాయకులు సందీప్‌రెడ్డి, నారాయణ, సంజీవ్, శివరావు, మాణిక్ పాల్గొన్నారు.

రఘునందన్‌రావును గెలిపించండి



ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

హత్నూర(సంగారెడ్డి): బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి బుచ్చంద్ర ఆధ్వర్యంలో మండల పరిధిలోని దౌల్తాబాద్‌లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బుచ్చంద్ర మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు బీజేపీ హామీనివ్వడంతోనే బీజేపీ తరుపున ప్రచారం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సత్యం, నవీన్‌కుమార్, రాజు, వీరయ్య, దుర్గయ్య పాల్గొన్నారు.

సీఎం మాటలతో మోసపోవద్దు

- కాంగ్రెస్, బీజేపీలను చిత్తుగా ఓడించాలి
- ఎమ్మెల్యే మాణిక్‌రావు



జహీరాబాద్ టౌన్: ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ టౌన్: సీఎం రేవంత్‌రెడ్డి మాటలను నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. జహీరాబాద్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు మద్దతుగా జహీరాబాద్ పట్టణంలోని హౌసింగ్ బోర్డు తదితర ప్రాంతాల్లో కారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ సాధ్యంకాని హామీలను ఇచ్చిందన్నారు. రూ.2లక్షల రుణమాఫీ, ఎకరానికి రూ.15 వేల రైతుబంధు, మహిళలకు రూ.2500 వేలు, వృద్ధులకు రూ.4 వేల పింఛన్లు, కల్యాణలక్ష్మి పథకం ద్వారా రూ.లక్షతో పాటు తులం బంగారం ఇస్తామంటే ప్రజలు నమ్మి ఓటేశారన్నారు. కానీ.. ఎన్నికల్లో గెలిచిన తరువాత హామీలను పక్కన పెట్టి సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపక్షాలను తిట్టడం ప్రారంభించారని విమర్శించారు. బీఆర్‌ఎస్ నాయకులు నామరవికిరణ్ గుప్తా, మోహియోద్దీన్, యాకూబ్, తంజీం, వెంకట్, తులసీదాస్ గుప్త, అబ్దుల్లా, బరూర్ దత్తాత్రి, ప్రభు యాదవ్, బండి మోహన్, రాకేష్,విశ్వేశ్వర్, శివ పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్

కల్హేర్(నారాయణఖేడ్): అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం నిజాంపేట మండలం ఖానాపూర్(బి), దామర్‌చెరువు, బల్కం చెల్క తండా, తదితర చోట్ల జహీరాబాద్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ తరపున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. జెడ్పీటీసీ నర్సింహారెడ్డి, ఎంపీటీసీ కిషన్‌నాయక్, మాజీ సర్పంచ్‌లు కిష్టారెడ్డి, ఈశ్వర్, నాయకులు దుర్గారెడ్డి, నవాబ్‌పటేలు, రూప్‌సింగ్, గంజాయి సంగయ్య, జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



వట్‌పల్లి సంతలో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

వట్‌పల్లి(అందోల్): హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. వట్‌పల్లి మండల కేంద్రంలోని సంతలో ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జహీరాబాద్ ఎంపీ స్థానాన్ని మూడోసారి కూడా బీఆర్‌ఎస్ పార్టీనే గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. డీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ జైపాల్‌రెడ్డి, అందోలు ఎంపీపీ జోగు బాలయ్య, నాయకులు వీరేశం, వరం మాజీ చైర్మన్ వీరారెడ్డి, ఎంపీపీ వైస్ చైర్మన్ బస్వరాజ్, సుభాష్‌నాయక్, సలీంసాబ్, గులాం రసూల్, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను నమ్మి మోసపోవద్దు

న్యాల్‌కల్(జహీరాబాద్): మోస పూరితమైన హామీలను ఇచ్చి అధికారంలో వచ్చిన కాంగ్రెస్ పార్టీని నమ్మి మోసపోవద్దని బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ ఓటర్లను కోరారు. శుక్రవారం రాత్రి న్యాల్‌కల్‌లో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ తనను గెలిపిస్తే సమస్యలను పరిష్కరించేందుకు శ్రద్ధ తీసుకుంటానని తెలిపారు. జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, నాయకులు దేవిప్రసాద్, రవిందర్, నర్సింహారెడ్డి, భాస్కర్, ప్రవీణ్‌కుమార్, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమం



జహీరాబాద్: మాట్లాడుతున్న ఉజ్వల్‌రెడ్డి



నారాయణఖేడ్: దుస్తులు కుడుతూ ప్రచారం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్‌షెట్కార్

జహీరాబాద్: కాంగ్రెస్ పార్టీతోనే ప్రజాసంక్షేమం, అభివృద్ధి సాధ్యమని ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి ఉజ్వల్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మల్‌చల్మ, మల్‌చల్మ తండా, శేఖాపూర్ గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సురేష్‌షెట్కార్‌ను మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. గత పాలకులు అవలంభించిన విధానాల వల్లే ప్రజా సంక్షేమం, అభివృద్ధి కుంటుపడిందన్నారు. దీంతో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇచ్చారని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రతిపక్షాలు ప్రజలను తప్పుదోవపట్టించే ప్రయత్నం చేస్తున్నాయని, వారి మోసపూరిత మాటలను నమ్మవద్దని సూచించారు. కార్యక్రమంలో ఐడీసీ మాజీ చైర్మన్ తన్వీర్, జెడ్పీటీసీ నాగిశెట్టి రాథోడ్, నాయకులు నర్సింహారెడ్డి, భాస్కర్, రాములు, పాండురంగారెడ్డి, నర్సింహులు, ముల్తాని, ఇమాంపటేల్, అక్బర్, ప్రతాప్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, నాగిరెడ్డి, అక్తర్‌గౌరి, రాజునాయక్, రవి, మల్లారెడ్డి, నాగిశెట్టి, హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

సురేష్ షెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

నారాయణఖేడ్: జహీరాబాద్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్ తరపున నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం పలు వార్డుల్లో సురేష్ షెట్కార్ చిన్నాన్న మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్‌షెట్కార్ ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా ఓ టైలర్ దుకాణంలో ఆనంద్ స్వరూప్ షెట్కార్ దుస్తులు కుడుతూ సురేష్ షెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట ప్రచారంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ దారం శంకర్, నాయకులు విద్యాసాగర్, శెట్టి శంకర్, వీరేశెట్టి, శేఖర్, లక్ష్మణ్, జీవన్ ఉన్నారు.



మునిపల్లి: బుస్సారెడ్డిపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

మునిపల్లి(అందోల్): కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని మాజీ ఎంపీపీ రాంరెడ్డి అన్నారు. మండల పరిధిలోని బుస్సారెడ్డిపల్లి, మల్లికార్జునపల్లి, అల్లాపూర్ గ్రామాల్లో శుక్రవారం జహీరాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేష్‌షెట్కార్ మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో తాజా మాజీ ప్రజాప్రతినిధులు సతీష్‌కుమార్, విజయ్‌కుమార్, రసూల్‌పటేల్, వెంకట్‌రాములు, సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

వెంకట్రామిరెడ్డిని ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సతీమణి యాదమ్మ
- బీఆర్‌ఎస్ శ్రేణుల ముమ్మర ప్రచారం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీఆర్‌ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థిగా వెంకట్రామిరెడ్డిని ఆశీర్వదించి గెలిపించాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సతీమణి యాదమ్మ, ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి సతీమణి ప్రణీతరెడ్డి అన్నారు. రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని ఆయా కాలనీలలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం ఎంతో అభివృద్ధిని సాధించిందన్నారు. అధికార కాంగ్రెస్ మోసపూరిత హామీలతో మళ్లీ ప్రజల ముందుకు వచ్చిందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్ప, తెల్లాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ లలితారెడ్డి, బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి, పటాన్‌చెరు జెడ్పీటీసీ సుప్రజ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రచారంలో పాల్గొన్న యాదమ్మ తదితరులు

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

సంగారెడ్డి టౌన్: బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ సంగారెడ్డి మండల అధ్యక్షుడు చక్రపాణి అన్నారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో మెదక్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా ఉపాధిహామీ కూలీల వద్దకు వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయన్నారు. పీవీఆర్ ట్రస్టు ద్వారా వెంకట్రామిరెడ్డి సేవలందించడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఉపాధిహామీ కూలీలకు ప్రచారం కరపత్రం అందజేస్తున్న నాయకులు, కార్యకర్తలు

ముమ్మరంగా ఇంటింటి ప్రచారం

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని శాంతినగర్, శ్రీనగర్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కుమార్‌యాదవ్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, డివిజన్ అధ్యక్షుడు అఫ్జల్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ కుమార్‌యాదవ్, నాయకులు

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం

ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు అభిషేక్ పాటిల్

జహీరాబాద్: బీజేపీ గెలుపుతోనే ప్రజా సంక్షేమం, దేశ అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు అభిషేక్ పాటిల్ అన్నారు. శుక్రవారం జహీరాబాద్ మున్సిపల్‌లో విలీనమైన రంజోల్ గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరోమారు నరేంద్రమోదీని ప్రధాని చేయాలని ప్రజలంతా కోరుకుంటున్నారన్నారు. జహీరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బీబీ పాటిల్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సుధీర్ భండారి, విశ్వనాథ్‌స్వామి, సంతోష్, అర్చన సారడా, అప్పం శ్రవణ్, పూల సంతోష్, ఉమారాణి, శోభారాణి, కుసుం, నారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, విషభ్, శ్రీనివాస్, సాయిదుర్గేష్, రాజు, నరేష్, మోహన్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



జహీరాబాద్: ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు, కార్యకర్తలు

పెద్దచల్మెడ గ్రామంలో ఇంటింటి ప్రచారం

మునిపల్లి(అందోల్): బీజేపీ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్‌ను గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ జిల్లా నాయకుడు అయప్పస్వామి అధ్వర్యంలో శుక్రవారం పెద్దచల్మెడ గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సిద్దయ్యసేట్, శ్రీనివాస్‌గౌడ్, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మునిపల్లి: పెద్దచల్మెడలో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీ ఇంటింటి ప్రచారం

పుల్‌కల్(అందోల్): మండల పరిధిలోని మిన్‌పూర్ తండాలో బీజేపీ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జహీరాబాద్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి బీబీపాటిల్‌ను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు.బీజేపీకి ఓటు వేసి ప్రధానమంత్రి నరేంద్ర మోడి నాయకత్వాన్ని బలపరుచాలని కోరారు.

హామీల అమలు ఏమైందీ?

ఎమ్మెల్యే హరీశ్‌రావుకు ఎన్‌ఎస్‌యూఐ నాయకుల ప్రశ్న

జిన్నారం(పటాన్‌చెరు): గతంలో మంత్రి హోదాలో ఉన్నప్పుడు హరీశ్‌రావు బొల్లారంలో ఎన్నోసార్లు పర్యటించారని, అప్పుడు ఇచ్చిన ఒక్క హామీ కూడా అమలు చేయలేదని ఎన్‌ఎస్‌యూఐ నాయకులు ప్రశ్నించారు. హరీశ్‌రావు తీరుపై శుక్రవారం ఎన్‌ఎస్‌యూఐ నాయకులు గోబ్యాక్ హరీశ్‌రావు అంటూ ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌యూఐ నాయకులు ఇమ్రాన్ మాట్లాడుతూ గత పదేళ్లుగా బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నా బొల్లారం ప్రజలకు కనీసం తాగునీరు అందించలేకపోయారని ధ్వజమెత్తారు. సరైన రోడ్లు, ప్రభుత్వ కార్యాలయాలు నిర్మిస్తామని చెప్పి మాట తప్పారని మండిపడ్డారు. బొల్లారం మున్సిపల్‌లోని సమస్యలు పరిష్కారమయ్యే వరకు తాము పోరాటం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో యువజన నాయకులు పాల్గొన్నారు.



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న యువజన నాయకులు

నీలం మధు గెలుపునకు విస్తృత ప్రచారం



జిన్నారం: జ్యోతినగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు



కంది: ఓడీఎఫ్‌లో ప్రచారం నిర్వహిస్తున్న నీలం మధు

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని అందూర్ గ్రామంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధుకు మద్దతుగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వడ్డె కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీపీ రవీందర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు.

బొల్లారం మున్సిపల్ పరిధిలో...

జిన్నారం మండల పరిధిలోని బొల్లారం మున్సిపల్ పరిధిలోని జ్యోతినగర్‌లో కాంగ్రెస్ యువజన నేత ప్రవీన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. కాంగ్రెస్‌ను గెలిపించేందుకు అన్నివర్గాల ప్రజలు సిద్ధంగా ఉన్నారని ప్రవీన్‌రెడ్డి అన్నారు.


ఓడీఎఫ్‌లో నీలం మధు ప్రచారం

కంది(సంగారెడ్డి): మండల పరిధిలోని ఎద్దుమైలారం ఆయుధ కర్మాగారం(ఓడీఎఫ్)లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటు సంస్థలకు అప్పగించిందని మండిపడ్డారు. దివంగత ప్రధాని ఇందిరాగాంధీ తీసుకువచ్చిన ఓడీఎఫ్ ప్రభుత్వ పరిధిలో కొనసాగేందుకు కాంగ్రెస్ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని తెలిపారు. తాను గెలిస్తే ఓడీఎఫ్ ఉద్యోగుల సంక్షేమం, న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీనిచ్చారు. ఉద్యోగులు, కార్మికులు తనకు మద్ధతిచ్చి గెలిపించాలని కోరారు. తాజా మాజీ సర్పంచ్ మల్లారెడ్డి, ఉప సర్పంచ్ చంద్రయ్య, ఐఎన్‌టీయూసీ నాయకులు పాల్గొన్నారు.

నేడు సీపీఎం విస్తృత స్థాయి సమావేశం

సంగారెడ్డి టౌన్: సీపీఎం బలపర్చిన మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధును గెలిపించాలని కోరుతూ సంగారెడ్డిలోని పీఎస్‌ఆర్ గార్డెన్‌లో శనివారం ఉదయం 11 గంటలకు విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు, జిల్లా అధ్యక్షురాలు నిర్మలారెడ్డి, రాష్ట్ర నాయకులు పాల్గొంటారని తెలిపారు. సీపీఎం నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని సూచించారు.

కాంగ్రెస్‌లో చేరికలు



కాంగ్రెస్‌లో చేరిన నాయకులు, కార్యకర్తలు

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్, బీజేపీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు శుక్రవారం కేరళ ఎంపీ సురేష్, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజురెడ్డి, మెదక్ డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అదేవిధంగా చందాపూర్, కోడిప్యాక, పన్యాల, సికింద్లపూర్ గ్రామాల నుంచి బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. హత్నూర జెడ్పీటీసీ ఆంజనేయులు నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కొన్యాల వెంకటేశం, కాంగ్రెస్ అధ్యక్షుడు కృష్ణ, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు రాజేందర్, బుచ్చిరెడ్డి, దుర్గారెడ్డి, అజీజ్, కొడిపల్లి రాములు, మధుసూదన్ రెడ్డి, మహేష్, దశరథ్ పాల్గొన్నారు.

డిజైర్ సొసైటీలో వేసవి శిబిరం

జిన్నారం: మండల పరిధిలోని డిజైర్ సొసైటీలో నేటి నుంచి వేసవి శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రవిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సిద్దిపేట, హైదరాబాద్, మెదక్, సంగారెడ్డి పరిధిలోని ఎయిడ్స్ బాధిత చిన్నారులతో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వాహనాల తనిఖీలో నగదు పట్టివేత

పటాన్‌చెరు టౌన్: వాహన తనిఖీలో రూ.3.4 లక్షల నగదును స్వాధీనం చేసుకున్న సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెహిదిపట్నం మల్లేపల్లికి చెందిన నందికొండ వరుణ్‌కుమార్ రేడియంట్ క్యాష్ మేనేజ్‌మెంట్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం వరుణ్‌కుమార్ తన ద్విచక్ర వాహనంపై లింగంపల్లి వైపు నుంచి పటాన్‌చెరు వైపు వస్తుండగా పటాన్‌చెరు పట్టణంలోని బజాజ్ షోరూం ఎదురుగా వరుణ్ ద్విచక్ర వాహనాన్ని తనిఖీ చేయగా అందులో ఉన్న నగదుకు సరైన ఆధారాలు చూపకపోవడంతో వాటిని పోలీసులు సీజ్ చేశారు.

ఇద్దరిపై కేసు నమోదు

పటాన్‌చెరు టౌన్: అక్రమంగా రసాయనాలను తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. పటాన్‌చెరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా చిరాగ్‌పల్లి దాబా వెనుక రాకేష్ ధరమ్‌సింగ్ అనే వ్యక్తి గదిని అద్దెకి తీసుకున్నాడు. దాబాకు వచ్చే ట్యాంకర్ల నుంచి డ్రైవర్లకు ఆశ చూపి మిథనాల్ క్లోరైడ్ అక్రమంగా తీసి పక్కకు పెట్టేవాడు. డ్రమ్ముల్లోకి నింపాక బాలానగర్‌లోని రసాయన పరిశ్రమలకు విక్రయించేందుకు శుక్రవారం తరలిస్తుండగా లక్దారం కూడలిలో తనిఖీలు చేస్తున్న పోలీసులకు పట్టుబడ్డాడు. ఇతనితో పాటు డీసీఎం డ్రైవర్ చందన్ సింగ్‌పై కేసు నమోదు చేశారు.